క్లుప్తంగా

విద్యార్థులకు తెలుగు పఠన పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాలులో శుక్రవారం విద్యార్థులకు 'తెలుగులో మాట్లాడటం'పై పోటీలు నిర్వహించారు. రామాయణం, మహాభారతాల అంశాలపై జరిగిన ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఆగస్టు 17న జరిగే కృష్ణాష్టమి నాడు బహుమతులు అందజేస్తామని ఇస్కాన్ నిర్వాహకులు లక్ష్మీపతిదాస్ తెలిపారు.

ప్యానెల్ లిస్టులో డీఎస్పీ వివేకానంద




శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందేందుకు అర్హత కల్పించే ప్యానెల్ లిస్టులో చోటు దక్కించుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 మందికి పైగా డీఎస్పీలు, ఏసీపీలు ఈ లిస్టులో ఉన్నారని.. మొదటి ఫేజ్‌లో భాగంగా 30 మంది ఈ నెలాఖరులో ఉద్యోగోన్నతి పొందుతారని.. రెండో ఫేజ్‌లో ఆయా కార్యాలయాల్లో పోస్టుల వేకెన్సీ అనుసరించి డిసెంబరు కల్లా మిగతావాళ్లు ఉద్యోగోన్నతి పొందే అవకాశముంది. వివేకానంద, ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన యర్రగుంట శృతిలు రెండో ఫేజ్‌లో ఉండగా టెక్కలి డీఎస్పీగా పనిచేసి డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న డి.బాలచంద్రారెడ్డి, శ్రీకాకుళం ఏపీఎస్పీ బెటాలియన్-1 డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీగా పనిచేసిన సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు మొదటిఫేజ్‌లో ఉన్నారు. ప్యానెల్ లిస్టులో ఉన్న వీరికి సీనియారిటీ, పెండింగ్ చార్జెస్, డిసిప్లినరీ కేసుల తదితర వివరాలను ఎటువంటి అభ్యంతరాలు లేకుండా డీజీపీ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది.

దోమల నివారణకు డ్రై డే


అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దోమల నివారణలో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లోనూ శుక్రవారం ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సెక్రటరీలు, ఎన్విరాన్మెంట్ అండ్ శానిటేషన్ సెక్రటరీలు, ప్రజా ఆరోగ్య మేస్త్రీలు ఆధ్వర్యంలో ఇంటింటా అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ పి.సుధీర్‌కుమార్‌లు బలగ సచివాలయ పరిధిలోని రాయివీధిలో జరిగిన కార్యక్రమానికి హాజరై దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎక్కడా వాడుక నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు.

టి.డి.వలసలో పారిశుద్ధ్య పనులు


మందులు, బ్లీచింగ్ పౌడర్ అందజేస్తున్న అధికారులు

జి.సిగడాం : టంకాల దిగ్గువలసలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో చెత్తాచెదారం తొలగించారు. డీఎల్‌పీఓ గోపిబాల, మండల ప్రత్యేకాధికారి చంద్రజీవన్, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, సర్పంచ్ టంకాల జగన్మోహిని ఆధ్వర్యంలో దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. తాగునీటి బావులు, బోర్లలో క్లోరినేషన్ చేయించారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడా మలేరియా జ్వరాలు లేవన్నారు. కార్యక్రమంలో టంకాల రామకృష్ణంనాయుడు, సూపర్‌వైజర్లు, హెచ్‌వీ, వీఎస్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


దోమల నివారణ మందులను పిచికారీ చేస్తున్న దృశ్యం


ఖాళీగా వ్యవసాయ పొలాలు

ఖరీఫ్ గట్టెక్కేనా?


చాపురం పంచాయతీ పరిధిలోని ప్రధాన గెడ్డ దుస్థితి..

- ఖాళీగా పంట కాలువలు
- ఎండిపోతున్న ఎదలు
- వరుణుడిపైనే భారమేసిన అన్నదాతలు


సిద్దిపేట గ్రామ పరిధిలో గెడ్డ ఇలా..

శ్రీకాకుళం రూరల్ :

అన్నదాతలను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 6,611 హెక్టార్లల్లో వరి పంట పండించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతానికి 3,200 హెక్టార్లల్లో ఎదలు వేశారు. ఎన్నడూ లేనివిధంగా ఎండలు మండిపోతుండటం, మరోవైపు వరుణుడి జాడ లేకపోవడంతో చాలాచోట్ల ఎదలు ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయి. ప్రధానంగా వ్యవసాయ పంటలకు సాగునీరు అందించే గెడ్డల్లో చుక్క నీరు కూడా రావడంలేదు. ప్రధాన కాలువలను సిద్ధం చేసినప్పటికీ కెనాల్స్ నుంచి పంట కాలువలకు నీరువచ్చే పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. మరికొన్నాళ్లు ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది ఖరీఫ్ కష్టమేనన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

మరో పదిరోజుల్లో..

మరో పది రోజుల్లో మండల కాలువల్లోకి పూర్తి స్థాయిలో సాగునీరు వచ్చే అవకాశాలున్నాయి. ఇప్పటికే వంశధార రిజర్వాయర్ నుంచి కొన్నిచోట్ల కెనాల్స్‌కు నీరు అందుతున్నట్లు సమాచారం ఉంది. సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందవద్దు.

– నవీన్, మండల వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

ఎదలు ఎండిపోతున్నాయి

ప్రస్తుతానికి 30 సెంట్ల విస్తీర్ణంలో దుక్కులు పట్టి ఎదలు వేశాం. మా పొలం లోతట్టు ప్రాంతం. ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరు అందితేనే పంటలు పండించగలం. లేకపోతే మధ్యలోనే ఆగిపోవాల్సిందే.

– పి.చిన్నారావు, రైతు, బైరివానిపేట

సాగునీరు ఎక్కడ?

మాకున్న పంట పొలాలను సిద్ధం చేసుకున్నాం. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఏ గెడ్డలోనూ కనీసం చుక్క నీరు కూడా కనిపించడంలేదు. చెరువుల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఎకరా పంట పండించాలంటే పూర్తిస్థాయిలో సాగునీరు ఉండాల్సిందే.

– ఎస్.శేఖర్, రైతు, సింగుపురం

ఆదమరిస్తే అంతే..



రాజాం – శ్రీకాకుళం ప్రధాన రహదారిలో పాలఖండ్యాం సమీపంలో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు తరచూ గోతుల్లోపడి గాయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

– జి.సిగడాం

సంతోషిమాతకు కుంకుమ పూజలు



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణ చేశారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

ప్లాస్టిక్ కాలుష్య రహిత నగరంగా శ్రీకాకుళం


సమావేశంలో మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్టోబర్ 2 నాటికి శ్రీకాకుళం నగరాన్ని పూర్తిగా ప్లాస్టిక్ కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయం వీసీ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్వచ్ఛ శ్రీకాకుళం' అనే నినాదానికి కట్టుబడి, పట్టణం నుంచి గ్రామ స్థాయి వరకు పాలిథిన్, ప్లాస్టిక్ నియంత్రణను ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. ఆర్డీవో, ఆర్టీసీ, మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్త చర్యలతో రహదారులు, బస్టాండ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛత సందేశాలతో సైన్ బోర్డులు తక్షణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2016 నుంచే అమల్లో ఉన్నాయని, వీటి ప్రకారం మున్సిపల్ స్థాయిలో విడదీసే సేకరణ, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ వ్యవస్థలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతిలేని పలచని క్యారీ బ్యాగులు, మల్టీ లేయర్డ్ ప్యాకేజింగ్ వినియోగ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థలు ప్లాస్టిక్ చెత్తను ప్రత్యేకంగా సేకరించి మళ్లీ ఉపయోగంలోకి తేవాలన్నారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ కరుణశ్రీ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ బి.వి.డి.ప్రసాదరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలు కఠినంగా అమలు చేయాలి: కలెక్టర్


శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పౌరహక్కుల పరిరక్షణ, అట్టడుగు వర్గాల రక్షణ కోసం పీసీఆర్, పీఓఏ చట్టాల అమలు కఠినంగా జరగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచార నిరోధక చట్టం (పీసీఆర్–పీఓఏ యాక్ట్) అమలు అంశాలను అధికారులు సమీక్షించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్‌తో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాలపై జరిగే హింసాత్మక చర్యలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొత్తం 9 మందికి రూ.6,95,052 పరిహారం అందించామని, హత్య కేసుల్లో ఉపాధి కల్పనలో 11 మందికి ఉద్యోగం ఇచ్చామని చెప్పారు. ఒక కేసులో ఉపాధి పెండింగ్‌లో ఉందని, అర్హురాలు ఒకరికి ఇప్పటికే రూ.8,25,000 చెల్లించామని వివరించారు. అత్యాచార నిరోధక చట్టం కింద ప్రత్యేక కోర్టులో 267 కేసులు విచారణలో ఉన్నాయని ఉన్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, వారానికి ఒక గ్రామాన్ని అధికారులు సందర్శించి ఆలయ ప్రవేశం, నీటి వనరుల వినియోగం, వేరు గ్లాస్ వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు.

పార్టీ అభ్యున్నతికి పాటుపడాలి


కిరణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పెయ్యల లక్ష్మణరావు

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పదవులు పొందిన ప్రతిఒక్కరూ పార్టీ అభ్యున్నతికి కృషి చేసి ప్రజలకు నిరంతం అందుబాటులో ఉండాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఎస్సీ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన పెయ్యల లక్ష్మణరావు శుక్రవారం కిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ

జి.సిగడాం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ అన్నారు. శుక్రవారం జాడ గ్రామంలో వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కావ్య, ఏఎన్‌ఎం యోగేశ్వరి, ఆశా కార్యకర్తలు గీత, నాగమ్మ పాల్గొన్నారు.

కొనలేం..తినలేం!

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- బెంబేలెత్తిపోతున్న వినియోగదారులు


జి.సిగడాం మార్కెట్‌లో కూరగాయలు

జి సిగడాం: కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడికి అందనంత పైకి ఎగబాకుతున్నాయి.ఏ కాయగూర ధర చూసిన కిలో రూ.60 పైమాటే. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. వంకాయలు కేజీ రూ.60, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, చిక్కుడుకాయలు రూ.60, బీన్స్ రూ.80, దొండకాయలు రూ.60, టమాటా 50 చొప్పున శుక్రవారం మార్కెట్‌లో ధర పలికాయి. ఉల్లి నాసికరం కేజీ రూ.40 కాగా, పెద్ద ఉల్లిపాయల ధర 60 రూపాయల పైనే. గత పది రోజుల నుంచి వంకాయలు, టమాటా ధర భారీగా పెరగడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పప్పులు, బెల్లం, చింతపండు, నూనెల ధరలు సైతం మండుతుండటంతో కూరలు వండటం కష్టమేనని గృహిణులు చెబుతున్నారు. కూరగాయల సాగు చేసే రైతులు తగ్గిపోవడం, వాతావరణం అనుకూలించకపోవడం వెరసి ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు.

వ్యాపారులకే లాభం..



మార్కెట్‌లో ఏ కూరగాయ కొనుగోలు చేసిన కిలో రూ.60 పైనే ఉంది. రైతుల దగ్గర పంట ఉంటే మాత్రం కేజీ 10 రూపాయలకు మించదు. దీంతో రైతుకు కష్టమే మిగులుతోంది. అదే సమయంలో వ్యాపారులు మాత్రం లాభపడుతున్నారు.

– గేదెల నారాయణరావు, గేదెలపేట

సాగు లేదు..



గతంలో పల్లెటూర్లలో ఎక్కువగా కూరగాయలు సాగు చేసేవారు. ధరలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం కూరగాయల సాగు బాగా తగ్గిపోయింది. కొన్ని గ్రామాలకే పరిమితమైంది. అందుకే ధరలు పెరుగుతున్నాయి.

– చందక సతీష్, రైతు, ముషనివలస

అస్తవ్యస్తంగా కూటమి పాలన


బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, పార్టీ శ్రేణులు

- సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసిన చంద్రబాబు
- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభలో మాజీ ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకుండా, అభివృద్ధిని అమడదూరంలో ఉంచిన చంద్రబాబు.. రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే మోసం, అబద్ధాలు అని.. కూటమి ఎత్తులతో రాజకీయం చేయడమే బాబుకు తెలిసిన విద్య అని విమర్శించారు. కూటమి మోసాలు, వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత పాలనలో జగనన్న అందించిన పథకాలు.. ప్రస్తుతం చంద్రబాబు కూటమి పాలనలో అందిన పథకాలపై వ్యత్యాసం ప్రజలకు వివరించాలని సూచించారు. క్యూఆర్ కోడ్ రూపంలో ప్రతి కుటుంబం నష్టపోయిన సంక్షేమాన్ని సవివరంగా తెలియజేయాలని చెప్పారు. మళ్లీ మన జగనన్న పాలనను తెచ్చుకోవాలని, రానున్న మన పాలనలో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. రేపటి నుంచి ప్రతి గ్రామంలో గడపగడపకు వెళ్లి జగనన్న పాలనను జ్ఞాపకం చేయాలన్నారు. సంక్షేమాన్ని హోరెత్తించి, అభివృద్ధికి బాటలు వేసిన జగనన్నే పాలనే మరలా రావాలనే ఆకాంక్షను ప్రజల్లోంచి తెప్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బోర సాయిరాం రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బల్లాడ హేమమాలిని రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దన రెడ్డి, ఎస్సీ సెల్ కార్యదర్శి పెయ్యల లక్ష్మణరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు నేతింటి నీలమప్పుడు, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, జిల్లా కార్యదర్శి అంబటి రాంబాబు, వైస్ ఎంపీపీలు జరుగుళ్ల శంకరరావు, బెందు రామారావు, నాయకులు కొత్తకోట సూర్యారావు, ముద్దాడ శంకర్, కోటిపాత్రుని హరికృష్ణ, పంచిరెడ్డి రాంబాబు, మాడుగుల మురళీధరబాబా, బోర గోవిందరెడ్డి, శివ, వెంకన్నగారి శ్రీను, అంబటి సూజాత, గవిరెడ్డి రవికుమార్, డొంక వెంకట రమణ, చిలక సన్యాసిప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ చంద్రబాబు మోసాలు


జి.సిగడాం: గెడ్డకంచరాంలో కూటమి ప్రభుత్వం మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జి.సిగడాం మండలం గెడ్డకంచరాం గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ పంచిరెడ్డి వైకుంఠరావు, మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు, అక్కచెల్లెళ్లకు, రైతులకు మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కొత్త పింఛన్ల కోసం వితంతువులు, వృద్ధులు ఏడాదిగా ఎదురుచూస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ ఇతర పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మహిళా కార్యదర్శి వాన ప్రమీల, యువజన విభాగం సభ్యుడు బాలి అప్పలసూరి, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు ఈసర్ల గోవిందరావు, చిక్కాల ధర్మారావు, సర్పంచ్ తొత్తడి రామారావు, వెలిది సాయిరాం, ఎంపీటీసీ బూటు అప్పారావు, ఎర్నేన ప్రకాశరావు, మీసాల కన్నంనాయుడు, మీసాల రాంబాబు, నక్క కరువునాయుడు, పరశరాపు చిట్టిబాబు, నక్క సూర్యారావు, పల్లి పైడియ్య, నక్క శ్రీరాములు, నక్క అసిరినాయుడు, కోరిగాన నరసయ్య, పంచిరెడ్డి చిన్న తవిటయ్య, వట్టి ఈశ్వరరావు, అల్లాడ శంకరరావు,పొన్నాడ లక్ష్మినారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రణస్థలం: చంద్రబాబు మోసాలు ఇంటింటికి వివరిస్తున్న లావేరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రబాబువి బూటకపు హామీలు ..

రణస్థలం: చంద్రబాబు బూటకపు హామీలు నమ్మి ప్రజలు మోసపోయారని వైఎస్సార్ సీపీ లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు అన్నారు. అదపాక, గుర్రాలపాలెం, పాతకుంకాం, కొత్తకుంకాం, పెద కొత్తపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి చంద్రబాబు మోసాలను వీడియో రూపంలో వివరించారు. ప్రజలు చెప్పిన కష్టాలు విని మరలా జగనన్న పాలన వస్తే మీ కష్టాలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మండల నాయకులు రొక్కం బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బొంతు సూర్యనారాయణ, నాయకులు గొర్లె అప్పలనాయుడు, వాళ్లె దాలినాయుడు, మహంతి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22న దేవాలయ భూములు వేలం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వర స్వామి దేవస్థానం భూములను ఈ నెల 22న ఒప్పంగి గ్రామ సచివాలయం వద్ద వేలం వేయనున్నట్లు ఈఓ పి.మాధవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒప్పంగిలోని సర్వే నంబరు 46/6లో 55 సెంట్లు, సర్వే నంబర్ 48/11లో 49 సెంట్లు, పల్లపు భూమి 2025–26 నుంచి 2027–28 సంవత్సరం వరకు కౌలు ఇచ్చేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.